సాక్షి
కాకినాడ

గురువారం । 9 । నవంబర్ । 2023



బొమ్మలకు జీవం.. అద్భుత ప్రావీణ్యం

కొబ్బరి పీచుతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేస్తూ మహిళలు ప్రతిభ కనబరుస్తున్నారు. కోనసీమలో కుటీర పరిశ్రమగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు.

II లో



బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనుల వైకుంఠంగా సాగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి జనం పోటెత్తుతున్నారు.

II లో

5,500 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు బుధవారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పుడెల్టాకు వెయ్యి, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమడెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. కాటన్ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

చంద్రబాబు మోసాన్ని ప్రజలు ఎప్పుడో గుర్తించారు



ద్రాక్షారామలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడి మోసపు నైజాన్ని రాష్ట్ర ప్రజలు ఏనాడో గుర్తించారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళలను, పంట రుణాలు రద్దు చేస్తానని రైతులను, ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తానని యువతను ఆయన మోసం చేశారని, దానికి బదులుగానే వారందరూ చంద్రబాబును సీఎం పీఠం నుంచి దించేశారన్నారు. ఆయన పాలనలో చేసిన స్కామ్‌లు ఒక్కొక్కటీ బయటపడుతున్నా, నిస్సిగ్గుగా అబద్ధాలతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. కానీ నిజమైన సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మన ప్రభుత్వంలో మేలు జరిగితేనే.. తిరిగి తనకు ఓటు వేయాలి' అని ప్రజలను ధైర్యంగా అడుగుతున్నారన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగనే ఎందుకు కావాలి అనే అంశంపై గురువారం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కన్వీనర్లు, గృహసారథులతో ప్రజల్లోకి వెళుతున్నామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, వైస్ చైర్మన్ కాకతీయ రాజు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ టీచర్‌గా అలీబేగ్



మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన మహమ్మద్ అలీబేగ్ రాష్ట్ర ఉత్తమ ఉర్దూ టీచర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు బుధవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుంచి సమాచారం వచ్చింది. అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో ఈ నెల 11న నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవ సభలో అలీబేగ్‌కు ఈ అవార్డును అందజేస్తారు. ఆయన ప్రస్తుతం కొత్తపేట మండలం కమ్మిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు. 1994–95లో అలీబేగ్ ఉత్తమ విద్యార్థిగా, 2023లో కొత్తపేట నియోజకవర్గ స్థాయి ఉత్తమ టీచర్‌గా అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ఉర్దూ టీచర్ అవార్డుకు ఎంపికైన అలీబేగ్‌ను పలువురు అభినందించారు.

వదంతులు నమ్మవద్దు



మధుసూదనరావు, ఆర్‌సీఆర్‌బీ, డీఈఈ

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇచ్చినట్టు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న వదంతులు నమ్మవద్దని రోడ్డు కం రైలు బ్రిడ్జి (ఆర్‌సీఆర్‌బీ) డీఈఈ బీవీ మధుసూదనరావు వెల్లడించారు. మరమ్మతుల కోసం ఈ నెల పదో తేదీ వరకు అనుమతి తీసుకున్నామని, వాహనాల రావడం మూలంగా బ్రిడ్జిపై తాము చేపట్టే పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో మెసేజ్‌లు ట్రోల్ చేస్తున్న కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి మాత్రమే బ్రిడ్జిపై వాహనాలను అనుమతించనున్నట్లు ఆయన ప్రకటించారు. బ్రిడ్జిపైకి భారీ వాహనాలు రాకుండా ఇరు వైపునా గడ్డర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం బ్రిడ్జి రోడ్డు మార్కింగ్, ఫుట్‌పాత్‌ల పెయింట్ పనులు కొనసాగుతున్నాయన్నారు. జాయింట్ల వద్ద మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): లోక్‌అదాలత్ ద్వారా రాజీపడదగిన కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఆమె ఆధ్వర్యంలో అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ, జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, చార్జ్‌షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా చూడాలన్నారు.

రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..



- 'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో సరికొత్త కార్యక్రమం
- నేటి నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ
- చేసిన పనులు సచివాలయాల్లో ప్రదర్శన
- కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా నోడల్ అధికారిగా సీపీఓ

సాక్షిప్రతినిధి, కాకినాడ: చేసిన మేలు ఎవరూ మరిచి పోకూడదంటారు. వివక్షకు తావు లేకుండా, అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసుకుంటూ వస్తోంది. గత పాలనలో లబ్ధి జరగాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకోవాలి. ఇంటిపై పార్టీ జెండా ఎగరేయాలి. పసుపు చొక్కా వేసుకుని పార్టీ తరఫున ప్రచారం చేయాలి. ఇన్ని చేస్తేనే గాని ప్రభుత్వ పథకం అందేది కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లుగా ప్రతి గడప వద్దకూ పారదర్శకమైన పాలన దరి చేరింది. ప్రత్యర్థి పార్టీకి ఓటేసినా కూడా అర్హత ఉంటే చాలు ప్రతి పథకం ద్వారా లభించే లబ్ధిని వలంటీరు ఇంటి ముంగిటకే వచ్చి తలుపు తట్టి మరీ చిరు నవ్వుతో అందిస్తున్నారు. ఇంత చేస్తున్నా ప్రతిపక్షాలు అడ్డగోలుగా బురద జల్లుతూ రాజకీయాలు చేస్తున్నాయి. వీటిని తిప్పి కొట్టి నాలుగున్నరేళ్లలో జిల్లాలో ప్రతి కుటుంబానికి అందించిన లబ్ధిని తెలియజేయడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి శ్రీకారం చుడుతున్న 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే' అనే వినూత్న కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 23 వరకు ప్రతి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం చేపట్టిన మేలును వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు వివరించనున్నారు.

నోడల్ అధికారుల నియామకం

ఈ కార్యక్రమం కోసం నోడల్ అధికారుల నియామకం పూర్తి అయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈఓపీఆర్‌డీలు, పట్టణ ప్రాంతాల్లో అదనపు కమిషనర్‌లు లేదా, డిప్యూటీ కమిషనర్‌లు, వారు అందుబాటులో లేకుంటే గెజిటెడ్ అధికారులు నోడల్ అధికారులుగా ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నోడల్ అధికారిగా జిల్లా ప్రణాళికా అధికారి (సీపీఓ) వ్యవహరిస్తారు. వీరి పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారికి నాలుగున్నరేళ్లలో చేపట్టిన ప్రగతిని వివరించి సచివాలయ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తారు. 32 శాఖల ద్వారా ప్రజలకు జరిగిన మేలుకు సంబంధించిన నివేదికలను సచివాలయాల్లో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శిస్తారు. కాకినాడ జిల్లాలోని 27 మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా గడచిన నాలుగున్నరేళ్లుగా జరుగుతోన్న మేలును వివరించనున్నారు. సంక్షేమమే కాకుండా వ్యవసాయం, 'నాడు–నేడు' ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు... ఇలా అన్నింటా జరిగిన అభివృద్ధి ప్రదర్శించనున్నారు. ఈ నెల తొమ్మిది నుంచి 23 వరకు ప్రతి రోజు 25 నుంచి 33 సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించేలా జిల్లా యంత్రాంగం షెడ్యూల్ నిర్ణయించింది.

9-11-2023 నుంచి 23-11-2023 వరకు కార్యక్రమ షెడ్యూల్

తేదీ	సచివాలయాలు సంఖ్య	తేదీ	సచివాలయాలు సంఖ్య
9	27	17	31
10	29	20	31
14	30	21	31
15	30	22	31
16	30	23	30

2019 నుంచి ఇప్పటి వరకు జిల్లా ప్రజలకు చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	అందజేసిన మొత్తం రూ.(కోట్లలో)
డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా	1,74,062	573.57
డాక్టర్ వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	79,242	11.56
డాక్టర్ వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్	59,724	296.35
ఇన్‌పుట్ సబ్సిడీ టు ఫార్మర్స్	74,963	94.95
డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం	1,636	27.53
డాక్టర్ వైఎస్సార్ పశు నేస్తం పరిహార పథకం	2,364	6.63
జగనన్న జీవక్రాంతి	4,183	7.74
జగనన్న పాలవెల్లువ	20,930	38.72
మత్స్యకారులకు భరోసా	24,147	99.61
డీజిల్ రాయితీ (లీటర్లలో)	3,04,08,742	18.92
జగనన్న వసతి దీవెన	48,078	170.07
జగనన్న విద్యా దీవెన	48,880	376.76
జగనన్న అమ్మ ఒడి	2,91,247	1154.64
జగనన్న విద్యాకానుక	1,91,630	116.63
గోరుముద్దలు	1,59,925	102.46
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	2,00,708	436.89
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	22,827	11.46
డాక్టర్ వైఎస్సార్ ఆసరా	37,273	897.83
డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక	2,82,386	3495.91
డాక్టర్ వైఎస్సార్ సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీఎస్)	44,793	161.72
డాక్టర్ వైఎస్సార్ చేయూత	1,03,576	540.79
జగనన్న తోడు	61,496	175.62
డాక్టర్ వైఎస్సార్ బీమా	3,989	64.81
పీఎం స్వానిధి	7,320	34.33
డాక్టర్ వైఎస్సార్ కాపు నేస్తం	46,557	264.34
జగనన్న చేదోడు (రజక, టైలర్స్, నాయీ బ్రాహ్మణులు)	13,314	37.29
ఈబీసీ నేస్తం స్కీం	9,995	28.31
డాక్టర్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,04,941	261.10
డాక్టర్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్	21,840	92.99
డాక్టర్ వైఎస్సార్ నేతన్న నేస్తం	2,642	30.16
డాక్టర్ వైఎస్సార్ వాహన మిత్ర	12,970	61.63

ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరిస్తాం



"ఈ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికా ప్రకారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహిస్తాం. ప్రస్తుతం 23వ తేదీ వరకు ఏ రోజు ఎన్ని సచివాలయాల్లో నిర్వహించాలో షెడ్యూల్ ఇచ్చాం. మిగిలిన రోజుల షెడ్యూల్ తర్వాత ప్రకటిస్తాం. సచివాలయాల్లో బోర్డులు, హోర్డింగ్‌లు పెడుతున్నారు. కార్యక్రమ పర్యవేక్షణకు నోడల్ అధికారులను కూడా నియమించాం. ప్రజలకు ఎంత మేలు జరిగింది, ఏ మేరకు నిధులు నేరుగా, వివిధ పథకాల ద్వారా అందించాం. ఆ గ్రామ అభివృద్ధిపై విపులంగా వివరించనున్నాం."

– కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా

ప్రభుత్వం చేసే మంచిని చెప్పండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు
- 'ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనే కావాలి'పై సమావేశం
- గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు సూచనలు

కాకినాడ రూరల్: ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచిని ప్రజలకు చెప్పేందుకు 'ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనే కావాలి' కార్యక్రమానికి గురువారం నుంచి శ్రీకారం చుడుతున్నామని, విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పిలుపు ఇచ్చారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు అధ్యక్షతన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ హయాంలో అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల కింద రూ.2.50 లక్షల కోట్ల పైచిలుకు సొమ్మును నేరుగా అకౌంట్లలో వేశారన్నారు. కుల, మతాలు, పార్టీ చూడకుండా వేశారన్నారు. ఎందుకు జగన్ కావాలంటే.. పథకాలు ఆగకూడదని, దౌర్జన్యాలు ఉండకూడదని, అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకోకుండా ఉండేటందుకన్నారు. ఇంద్రపాలెంలో ప్రారంభమవుతున్న కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. పథకాల లబ్ధికి సంబంధించిన వివరాలను అధికారులు సచివాలయం వద్ద బోర్డులో డిస్‌ప్లే చేస్తారన్నారు. తరువాత మన పార్టీ నాయకులు ఏదో సెంటర్‌లో జెండా ఆవిష్కరణ, ఇంటింటికి వెళ్ళి బుక్‌లో జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చారా లేదా కనుక్కుంటామన్నారు. రాత్రి అక్కడ బస చేయవచ్చన్నారు. పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. సర్పవరం జంక్షన్‌లో సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పొరుగ పచ్చగా ఉంటే చూడలేని పచ్చ బ్యాచ్ గురించి తక్కువ మాట్లాడటంతో పాటు మన పార్టీ, మన నాయకుల గురించి తక్కువగా మాట్లాడేవారికి ధైర్యంగా సమాధానం చెప్పాలని కోరారు. సమావేశంలో ఏపీకి జగనే ఎందుకు కావాలో కార్యక్రమ వివరాలను జేసీఎస్ మండల కన్వీనరు గీసాల శ్రీనివాసరావు వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జేఎస్‌టీయూ ఈసీ మెంబరు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ప్రసంగించారు. నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, అనుసూరి ప్రభాకరావు, లింగం రవి, మేకా కృష్ణంరాజు, నాని, గగారిన్, ధర్మరాజు, రామిరెడ్డి, కొండలరావు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కృష్ణాపురం, వాకదారిపేటల్లో రూ.4.18 కోట్లతో రోడ్లకు శంకుస్థాపన



తొండంగి మండలం కృష్ణాపురంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి రాజా

తొండంగి: రాష్ట్రంలో ప్రజలకు నవరత్నాల సంక్షేమ పథకాలు అందించడంతోపాటు యువతకు ఉపాధి కల్పన కోసం పారిశ్రామికాభివృద్ధితో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి దాడిశెట్టిరాజా అన్నారు. బుధవారం తొండంగి మండలంలోని ఒంటిమామిడి దివీస్ ల్యాబొరేటరీస్ సీఎస్ఆర్ నిధులతో కృష్ణాపురంలో రూ2.74 కోట్లతో, వాకారిపేటలో రూ1.44 కోట్లతో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ తీరప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా రహదారుల అభివృద్ధి, మినీపోర్టు నిర్మాణం జరుగుతుందన్నారు. పర్యావరణానికి విఘాతం కలగకుండా అగ్రికల్చర్ బేస్డ్ పరిశ్రమల స్థాపన జరుగుతోందన్నారు. తీర ప్రాంతం భవిష్యత్తులో అగ్ర నగరాల సరసన చేరనుందన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో దివీస్ ల్యాబొరేటరీస్ మౌలిక వసతుల కల్పన, విద్యాభివృద్ధి, ప్రజారోగ్యం కోసం రక్షిత మంచినీటి వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు వంటి సేవలు అందించడం అభినందనీయమన్నారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో పసుపులేటి సతీష్, దివీస్ కంపెనీ ప్రతినిధులు సుధాకర్, వాసుబాబు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి, సర్పంచ్‌లు కందా శ్రీధర్, బుర్తి రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యులు ఇంటి వీరభద్రరావు, దడాల విజయ్, బద్ది బుజ్జి, పేకేటి సూరిబాబు, ఎంఎల్‌వో మాకినీడి రాజేష్, పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ప్రసాద్ బుధవారం అన్నవరంలో రత్నగిరిపై వీర వెంకట సత్యనారాయణస్వామిని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఈఓ చంద్రశేఖర్‌అజాద్ ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీస్సులు అందజేయగా, స్వామివారి ప్రసాదాలను ఈఓ అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నుంచి జీజీహెచ్‌కు..

డీఎంహెచ్‌ఓ, డీఐఓ ఆధ్వర్యంలో రోగుల చేరిక



అందుతున్న వైద్య సేవలను డీఎంహెచ్‌వో, డీఐవోకు వివరిస్తున్న పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ

కాకినాడ క్రైం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నుంచి పలువురు రోగులు, అనారోగ్య బాధితులను ఉన్నత, నాణ్యమైన వైద్య సేవల కోసం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్, డీఐవో డాక్టర్ రత్నకుమార్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ బృందం జీజీహెచ్‌కు చేర్చింది. బుధవారం అధికారులు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్, డీసీఆర్‌ఎంవో డాక్టర్ అనితల ఆధ్వర్యంలో సుమారు వంద మందిని జీజీహెచ్ ఓపీలో నమోదు చేశారు. అనంతరం ఆ బృందం ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో పర్యటించి టెలీహబ్ సేవలను పరిశీలించారు. ఎన్‌ఆర్‌సీ, డైస్ సేవలను పర్యవేక్షించారు. ఎస్ఐసీయూకి వెళ్లి నవజాత శిశువులకు అందుతున్న వైద్య సేవలను గమనించారు. పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబతో మాట్లాడి ఆసుపత్రిలో చంటి పిల్లలకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. పీడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ భాస్కర్ సహా ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

14న ప్రైమ్ మినిస్టర్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14వ తేదీన ప్రైమ్ మినిస్టర్ అప్రెంటిస్ మేళా–2023 నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడతో పాటు కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ కంపెనీల్లో అప్రెంటిస్ పోస్టులు భర్తీ చేయడానికి ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 86392 30775 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

అమ్మ వద్దు.. పింఛనే ముద్దు



కొడుకు ఆదరణకు నోచుకోని అప్పయ్యమ్మ

కరప: కన్నతల్లి యోగక్షేమాలు గాలికొదిలేసి ఆమెకు ప్రతి నెలా వచ్చే పింఛన్‌ను మాత్రం ఠంచనుగా తీసుకొని వాడుకుంటున్న ప్రబుద్ధుడి ఉదంతమిది. ఎక్కడి నుంచో కరప వచ్చిన ఓ వృద్ధురాలు తన కొడుకు తనను ఏ విధంగా ఇబ్బంది పెడుతున్నాడో వివరించింది. తన పేరు కారపురెడ్డి అప్పయ్యమ్మ అని, కాకినాడలోని బ్యాంక్‌పేట వీధి అని, కొడుకు పేరు రాంబాబు అని, రిక్షా తొక్కుతాడని, భర్తపేరు ఆదినారాయణ (లేటు) అని ఆమె చెబుతోంది. కన్నకొడుకే ప్రతినెలా తనకు వచ్చే పింఛన్ తీసుకుని, ఒకో నెలలో ఒకో గ్రామంలో వదిలి వెళ్లడం, ఒకటో తారీఖు ముందు రోజు వచ్చి తీసుకెళ్లడం పరిపాటిగా మారిందని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. రెండు రోజుల క్రితం కరపలోని దుర్గాదేవి గుడి వద్ద కనిపించిన ఆమెకు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఆర్ఎంపీ గునిపే శోభన్‌బాబు టిఫిన్ పెట్టి, కప్పుకోవడానికి దుప్పటి ఇచ్చి, మార్కెట్ షెడ్‌లో ఆశ్రయమిచ్చారు. బుధవారం పుష్కరాల రేవు వద్ద ఉన్న ఆమెను జనావళి వృద్ధాశ్రమంలో చేర్చారు. పోలీసులు, అధికారులు స్పందించి వృద్ధురాలు అప్పయ్యమ్మ కొడుకు రాంబాబును పట్టుకుని తగిన విధంగా బుద్ధి చెప్పాలని మాజీ సర్పంచ్ కోరుతున్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడని ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తుని – నర్సీపట్నం మధ్యలో విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి సుమారు 25 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి ఒంటిపై నలుపు రంగు జీన్ ప్యాంటు, సిమెంట్ రంగు చొక్కా ఉన్నాయి. మృతుడి వివరాలేమీ తెలియలేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు క్షేమంగా బాలుడు



రాజమహేంద్రవరంలో బాలుడితో పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటి నుంచి పారిపోయిన వచ్చిన ఓ బాలుడిని ప్రకాశం నగర్ పోలీసులు క్షేమంగా అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల ఏడో తేదీ రాత్రి కానిస్టేబుల్ సీహెచ్ శేషు నైట్ బీట్ గస్తీలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అయోమయంగా తిరుగుతున్న 15 ఏళ్ల బాలుడు కనిపించాడు. అనుమానంతో ఆ బాలుడిని ప్రశ్నించగా, తన పేరు దేవరకొండ సత్య విశ్వనాథ్ అని, తండ్రి వీరభద్రరావు అని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం తన స్వగ్రామమని, తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుంచి పారిపోయి వచ్చానని చెప్పాడు. వెంటనే కానిస్టేబుల్ సీహెచ్ శేషు ఈ విషయాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృపానందానికి సమాచారం ఇచ్చారు. ఆ బాలుడిని ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం వారికి బాలుడిని క్షేమంగా అప్పగించారు.

బొమ్మలకు జీవం.. అద్భుత ప్రావీణ్యం



అప్పనపల్లిలో పీచుతో బొమ్మలు తయారు చేస్తున్న మహిళలు



పీచుతో అందంగా రూపుదిద్దుకున్న బొమ్మలు



కొబ్బరి పీచుతో తయారు చేసిన దండ

- డొక్క పీచుతో అందమైన బొమ్మలు
- ప్రతిభ చూపుతున్న మహిళలు
- 400 మందికి శిక్షణ

మామిడికుదురు: కొబ్బరి పీచుతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేస్తూ మహిళలు ప్రతిభ కనబరుస్తున్నారు. కోనసీమలోని పలు గ్రామాల్లో బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కోనసీమలోని అప్పనపల్లి, బి.దొడ్డవరం, లూటుకుర్రు, పెదపట్నం, పెదపట్నంలంక, పాశర్లపూడి, ఈదరాడ, జనుపల్లి గ్రామాల్లో కొబ్బరి పీచుతో బొమ్మల తయారీపై పలువురు మహిళలు శిక్షణ పొందారు. బొమ్మల తయారీలో వారికి రాజమహేంద్రవరం క్వాయర్ బోర్డుతో పాటు నాబార్డు బాసటగా నిలుస్తోంది. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ నిర్వాహకుడు కటికిరెడ్డి గంగాధర్ ఈ శిక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీతో పాటు ఇతర ఉప ఉత్పత్తుల తయారీపై 400 మంది మహిళలు శిక్షణ పొందారు. వీరు కొబ్బరి పీచుతో ఏనుగులు, తాబేళ్లు, జిరాఫీలు, లేడి, నెమలి, గుర్రం, ఒంటె, పిచ్చుక గూళ్లు, గృహాలంకరణ వస్తువులు తయారు చేస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నారు. మహిళలు తయారు చేస్తున్న బొమ్మలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో క్వాయర్ బోర్డు ఆధ్వర్యాన ఎగ్జిబిషన్లలో ప్రదర్శించి, విక్రయిస్తున్నారు.

తయారీపై శిక్షణ పొందాం



మా గ్రామం నుంచి చాలా మంది మహిళలు డొక్క పీచుతో బొమ్మల తయారీపై శిక్షణ పొందారు. కోనసీమలో సులభంగా లభ్యమయ్యే డొక్క పీచుతో ఎన్నో అద్భుతమైన బొమ్మలు తయారు చేయవచ్చు. వీటితో పాటు కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీకి కూడా ఆస్కారం ఉంది. క్వాయర్ బోర్డు సహకారం అందిస్తే దీనిని కుటీర పరిశ్రమగా మరింతగా విస్తరిస్తాం.

– వానరాశి సరస్వతి, మామిడికుదురు

జీవనోపాధి



కొబ్బరి పీచుతో బొమ్మలు తయారు చేయడం చాలా సులభం. బొమ్మల తయారీపై క్వాయర్ బోర్డు ఇచ్చిన శిక్షణలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పీచుతో ఎంతో అందంగా ఉండే బొమ్మలు రూపుదిద్దుకుంటున్నాయి. బొమ్మల తయారీని ప్రతి గ్రామానికీ విస్తరిస్తే మహిళలకు మరింత జీవనోపాధి కలుగుతుంది. ఈ దిశగా క్వాయర్ బోర్డు కార్యాచరణ చేపట్టాలి.

– కాకి వెంకటనాగలక్ష్మి, బి.దొడ్డవరం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



కొబ్బరి పీచుతో బొమ్మలు తయారు చేయడంలో ఎంతో మంది మహిళలు శిక్షణ పొందారు. కానీ మేం తయారు చేస్తున్న బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం పెద్ద సమస్యగా మారింది. క్వాయర్ బోర్డుతో పాటు ప్రభుత్వం కూడా మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలి. దీనివల్ల మహిళలకు మేలు జరుగుతుంది. మరింత మంది బొమ్మల తయారీకి ముందుకు వస్తారు.

– పెద్దిరెడ్డి సురేఖ, అప్పనపల్లి

నేటి నుంచి సౌత్ జోన్ కబడ్డీ టోర్నీ



సతీష్ రెడ్డి

గండేపల్లి: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కళాశాలలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ (పురుషులు) టోర్నమెంట్ గురువారం నుంచి ఐదు రోజుల పాటు జరగనుంది. ఈ టోర్నీని రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభిస్తారని ఆదిత్య కళాశాల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం గండేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఆరు రాష్ట్రాల పరిధిలోని 113 వర్సిటీల నుంచి 1,200 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. ప్రారంభోత్సవానికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఏపీ ఉన్నత మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నన్నయ వర్సిటీ వీసీ కె.పద్మరాజు తదితరులు హాజరవుతారన్నారు.

కొట్లాట కేసులో ఇరువర్గాలకు జరిమానా

పెదపూడి: కొట్లాట కేసులో ఇరువర్గాలకు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కరకుదురులో 2018 సంవత్సరంలో ఎం.బ్రహ్మాజీ, వైఎస్ రావు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై విచారణ అనంతరం బుధవారం కాకినాడలోని పీజేసీఐ కమ్ జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ వీఎల్ఎస్.సుందరి తీర్పునిచ్చారు. బ్రహ్మాజీ వర్గానికి రూ.10 వేలు, వైఎస్‌రావు వర్గానికి రూ.15 వేల జరిమానా విధించారు.

ఉత్సాహంగా సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్ -14, 17 ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ప్రారంభించారు. 60 మంది రెండు విభాగాల్లో హాజరు కాగా, 32 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. బాపట్ల జిల్లాలో ఈ నెల 11, 12 తేదీలలో జరిగే అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలలో జిల్లా తరఫున వీరు పాల్గొంటారని ప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలనికోరారు. సైక్లింగ్ ఎంపికల్లో 12 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని సహకారం అందించారు.

11న టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 11న టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి ప్రసాద్ బుధవారం తెలిపారు. కాకినాడ గుడారిగుంట డీమార్ట్ సమీపంలోని మున్సిపల్ టెన్నిస్ కోర్టులో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు ఆరోజు ఉదయం 9 గంటలకు వేదిక వద్దకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 94908 96851 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

- రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టులు
- ఈ నెల 29, 30 తేదీల్లో గుంటూరులో నిర్వహణ



విజేతలతో డీవైఈవో నారాయణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్ కాస్ట్) ఆధ్వర్యంలో స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లో బుధవారం 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు ఘనంగా నిర్వహించారు. వీటిని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈవో తులసీదాస్ ప్రారంభించారు. డీవైఈవో మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోని పరిశోధనలను ప్రోత్సహించాలన్నదే నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశమన్నారు. న్యాయనిర్ణేతలుగా వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, శ్రీనివాస్, దుర్గారావు, మల్లికార్జున, హరినాథ్ రెడ్డి, ఎం.రాజీవ్ వ్యవహరించారు.

రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టులు

రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల, శ్రీగౌతమీ పాఠశాల, కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూలు, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. గుంటూరులో జరిగే ఈ నెల 29, 30వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఆ విద్యార్థులు పాల్గొంటారని జిల్లా ఆప్ కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కస్సూరి సతీష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, అకడమిక్ కోఆర్డినేటర్ మేకా సుసత్య రేఖ, రిసోర్స్ పర్సన్స్ ఆనంద్ బాబు, సుబ్బయ్య, ఆంజనేయులు, ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్‌పర్సన్ యేలేటి విజయ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడిపూడి పార్థసారథి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



రామారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ రాజామణి

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామానికి చెందిన కుంపట్ల రామారావు (56) ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఏపీఓ రాజామణి తెలిపిన వివరాల ప్రకారం.. చాకలిపాలెం కాలువలో తూటు తొలగిస్తుండగా ఉదయం 11 గంటలకు రామారావుకు గుండెపోటు వచ్చింది. కాలువలో నుంచి గట్టు పైకి వచ్చి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటనపై ఉపాధి కూలీలు ఏపీఓ రాజామణికి సమాచారం అందించడంతో ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్‌తో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

- వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు
- గజవాహనంపై స్వామివారి దర్శనం



స్వామి వారికి అభిషేకం చేస్తున్న పండితులు



రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై స్వామి వారు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు పూజలు, సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై బీవై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

గురువారం ఉదయం స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, తిరుప్పావడ సేవ, చూర్ణోత్సవం, ప్రధాన హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజనం, కల్కి అలంకరణతో అశ్వవాహన సేవ తదితర పూజా కార్యక్రమాలు జరుపుతారు.

విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాష్టీకం

నిడదవోలు: పట్టణంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వీరమల్ల మనోజ్ కుమార్‌ను ఉపాధ్యాయుడు వసంత్ కుమార్ కర్రతో కొట్టడంతో ఎడమ కన్ను దెబ్బతింది. తోటి విద్యార్థులు అతడిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం లయన్స్ కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మనోజ్ కుమార్‌కు వైద్యులు కంటి పరీక్షలు చేశారు. కంటి నుంచి రక్తం కారి గడ్డకట్టడంతో విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇంత జరిగినా స్కూల్ యాజమాన్యం మాత్రం మనోజ్ కుమార్‌ను పట్టించుకోలేదు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.